క్లుప్తంగా

కేఎల్‌యూలో మహిళా సాధికారిక సదస్సు



మంగళగిరి: నగర పరిధిలోని వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో సోమవారం మహిళా సాధికారికత సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలంటే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, గ్రాంట్లు, బ్యాంకు రుణాలు గురించి వివరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ కె.రామారావు, కేఎస్ జగన్నాథరావు, వీపీఎస్ ప్రసాద్, బి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.

జ్ఞాపకాలను భావితరాలకు అందించే ఏకైక విద్య ఫొటోగ్రఫీ



మంగళగిరి: జ్ఞాపకాలను భావితరాలకు అందించే ఏకైక విద్య ఫొటోగ్రఫీ అని ఫొటో స్టూడియోస్ అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రపంచ ఫొటో గ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం అసోసియేషన్ ప్రతినిధులు కాజ ఆమోదిని అనాథ ఆశ్రమంలో పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఫొటోగ్రఫీ సృష్టికర్త లూయిస్ డాగ్యూరే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు కొండా అభిరామకృష్ణారెడ్డి, మర్రెడ్డి శివనాగిరెడ్డి, జంజనం వీర్లు నందం వీరాంజనేయులు, పడాల అమర్నాథ్, పడాల అనిల్ కుమార్, పల్లి ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

పోటీలు ప్రతిభకు కొలమానం

మంగళగిరి: విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మకతను గుర్తించి వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు పోటీలు కొలమానమని కేఎల్ యూనివర్సిటీ విద్యార్థి సంక్షేమ విభాగ ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఏఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. సోమవారం యూనివర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ డేటా విభాగం ఆధ్వర్యంలో మండలంలోని చిర్రావూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీసీ, ప్రొ వీసీలు పార్థసారథి వర్మ, ఏవీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

మేడికొండూరు: రోడ్డు ప్రమాదంలో మహిళ గాయపడిన ఘటన మండల పరిధిలోని పేరేచర్ల కాలువ వద్ద సోమవారం చోటుచేసుకుంది. సీఐ దార్ల జయకుమార్ తెలిపిన వివరాలు.. ఫిరంగిపురం మండలం గరుడ చల్లావారిపాలేనికి చెందిన వి.రాజ్యలక్ష్మి తన బంధువు మృతిచెందడంతో కాకర్లమూడి వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమై పేరేచర్ల కాలువ వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనదారుడు అజాగ్రత్తతో రాజ్యలక్ష్మి ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నాడు. ప్రమాదంలో రాజ్యలక్ష్మి తలకు తీవ్రగాయాలు అయ్యాయి. 108 వాహనం రావడానికి సమయం పడుతుందనడంతో కొందరి యువకుల సహాయంతో ఓ జర్నలిస్ట్ కారులో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

తాగునీటి నమూనాల సేకరణ

మంగళగిరి: ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించేందుకు నగరంలో సరఫరా అవుతున్న ఇంటి కుళాయిలు, వీధి కుళాయిల నుంచి 750కు పైగా శాంపిల్స్ సేకరించడం జరిగిందని నగర కమిషనర్ అలీంబాషా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కుళాయిలతో పాటు 136 ప్రైవేటు వాటర్ ప్లాంట్లు నుంచి నీటి శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌లకు పంపించామన్నారు. నగర ప్రజలు తమ వార్డుల పరిధిలో తాగునీరు కలుషితం, రంగు మారటం జరిగితే వెంటనే అధికారులకు సమాచారమివ్వాలన్నారు. తాగునీటి సరఫరాపై సమస్యలు తెలిపేందుకు 08645-295192, 7093912653లకు ఫోన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

దోమల నియంత్రణపై దృష్టి

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలో దోమల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. నీటి నిలువ మురుగు కాలువలలో సోమవారం గంబూషియా చేపలను వదిలారు. ఆయన మాట్లాడుతూ దోమలను నియంత్రించేందుకు హెల్త్ సెంటర్‌ల పరిధిలోని పాడు బడిన బావులు, కాలువలలో గంబూషియా చేపలను వదలడం జరిగిందన్నారు. ప్రజలు కూడా తమ ఇళ్ళతో పాటు చుట్టు పక్కల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.అనూష పాల్గొన్నారు.

వేద విద్యార్థులతో ఉపకర్మ



ఉపకర్మ నిర్వహిస్తున్న విద్యార్థులు



ఆశీర్వచనం తీసుకుంటున్న భక్తులు



భక్తులకు దర్శమిస్తున్న స్వామి వారు

నగర పరిధిలోని సీతానగరం విజయకీలాద్రిపై సోమవారం విద్యార్థులతో ఉపకర్మ నిర్వహించారు. అనంతరం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీ వేంకటేశ్వర స్వామికి అభిషేకం, హయగ్రీవ జయంతి సందర్భంగా హయగ్రీవ హోమం, పూర్ణాహుతి, అష్టోత్తర శతనామార్చన తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. - మంగళగిరి

సంస్కృత భాషాభివృద్ధికి బాటలు వేసిన ఉన్నవ దంపతులు



సంస్కృత ఉపాధ్యాయురాలికి సన్మానం



మాట్లాడుతున్న భాస్కరశర్మ

గుంటూరు ఎడ్యుకేషన్: సంస్కృత భాషాభివృద్ధికి బాటలు వేసిన ఉన్నవ దంపతులను ఆదర్శంగా తీసుకోవాలని శ్రీశారదానికేతన్ విద్యాసంస్థల కార్యనిర్వహణాధికారి జి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బ్రాడీపేటలోని శ్రీశారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ప్రపంచ సంస్కృత భాషా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ శారదానికేతన్ విద్యాసంస్థల వ్యవస్థాపకులైన ఉన్నవ లక్ష్మీనారాయణ, లక్ష్మీబాయమ్మ దంపతులు సంస్కృత భాషాభివృద్ధికి ఆనాడే విశేష కృషి చేశారని కొనియాడారు. విద్యార్థినులు సంస్కృత భాషలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఓరియెంటల్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఆర్.దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.ఉషాకుమారి పాల్గొన్నారు.

సంస్కారాన్ని నేర్పించే సంస్కృతం

మనిషిని సంస్కరించి, సంస్కారాన్ని నేర్పించేది సంస్కృత భాష అని ప్రముఖ సంస్కృత, జ్యోతిష్య పండితుడు ధూళిపాళ్ల భాస్కరశర్మ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో సంస్కృతభారతి, సంస్కృత విభాగం సంయుక్తంగా సంస్కృత భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. భాస్కరశర్మ మాట్లాడుతూ సంస్కారవంతమైన భాష, ఉచ్ఛారణతోనే మనిషి సమాజంలో గౌరవించబడతారని అన్నారు. మన పూర్వీకులు విలువైన నిధిని భూమిలోనూ, జ్ఞాననిధిని బుర్రలోనూ దాచారని చెప్పారు. అన్ని భాషలకు సంస్కృతం తల్లి వంటిదని, మానవ జీవనానికి సంస్కృతం దిశ, దశ చూపిస్తుందని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్ మాట్లాడుతూ శ్రావణ పూర్ణిమ విశ్వ సంస్కృత దినోత్సవమని, అపారమైన జ్ఞానరాశి సంస్కృతంలో ఉన్నదని తెలిపారు. సంస్కృత భాషపై పట్టు సాధించాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఎన్ని భాషల్లోనైనా ప్రావీణ్యం సంపాదించవచ్చునని, అన్ని భాషలతో పాటు సంస్కృతాన్ని నేర్చుకోవాలని సూచించారు. కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ పి.దేవేంద్రగుప్తా మాట్లాడుతూ సంస్కృత భారతి కృషితో దేశంలో ఎనిమిది సంస్కృత గ్రామాలు ఏర్పడ్డాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఏ భానుమురళీధర్, ఎన్ఎస్ఎస్ అధికారి జేవీ సుధీర్‌కుమార్, అధ్యాపకులు అంజనీకుమార్, ఆర్.స్వామి పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఏపీ రిటైర్డ్ పోలీస్ అధికారులు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌ను ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ(రిటైర్డ్ ఏఎస్పీ), కోశాధికారి కె.వి.నారాయణ, కార్యవర్గ సభ్యులు బీవీ సుబ్బారెడ్డి మర్యాద పూర్వకంగా కలిచారు. పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం నిర్వహించిన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. విశ్రాంత పోలీస్ అధికారుల సమస్యల పరిష్కారంపై జిల్లా ఎస్పీ సానుకూలంగా స్పందించారని సత్యనారాయణ తెలిపారు.



జిల్లా ఎస్పీని సన్మానిస్తున్న దృశ్యం

ఆత్మీయతను పంచే రక్షా బంధన్



పొన్నూరు జెడ్పీటీసీ సభ్యుడు రమేష్‌కు రాఖీ కడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: సోదరీ, సోదరుల మధ్య ఆత్మీయతను పంచే రక్షా బంధన్ రక్త సంబంధానికి అతీతమైనదని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. సోమవారం రక్షా బంధన్ సందర్భంగా జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పొన్నూరు జెడ్పీటీసీ కర్లపూడి రమేష్‌కు రాఖీ కట్టారు. అక్కా తమ్ముడు, అన్నా చెల్లెళ్ల ప్రేమానురాగాలకు రాఖీ పండుగ ప్రతీక అని అన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు రాణించాలి

పట్నంబజారు: రక్షాబంధన్ పురస్కరించుకుని తూర్పు మాజీ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫాకు వైఎస్సార్ సీపీ మహిళ కార్పొరేటర్లు, మహిళ నేతలు రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. మంగళదాస్‌నగర్‌లోని ఆయన నివాసంలో రాఖీ కట్టి మిఠాయిలు తినిపించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ అక్క చెల్లెమ్మలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మర్రి అంజలి, ఫర్హానా, రిహానా, మల్లవరపు రమ్య, కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ నేతలు సుబ్బులు, రమణి, అంజలి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

సోదరభావం పెంచుదాం..

లక్ష్మీపురం: అమ్మాయిలపై దాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా గరల్స్ కమిటీ కన్వీనర్ సుచరిత పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని లాలాపేట, పాతగుంటూరు, కొత్తపేట, పట్టాభిపురం పలు పోలీస్ స్టేషన్‌లలో పోలీస్ అధికారులకు సోమవారం రాఖీలు కట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు షేక్ సమీర్, జిల్లా సహాయ కార్యదర్శి పవన్, సభ్యులు శ్వేత పాల్గొన్నారు.



విద్యార్థులకు రాఖీలు కడుతున్న విద్యార్థినులు



ముస్తఫాకు రాఖీ కడుతున్న మహిళ కార్పొరేటర్లు



లాలాపేట సీఐ శివప్రసాద్‌కు రాఖీకడుతున్న ఎస్ఎఫ్ఐ గరల్స్ కన్వీనర్ సుచరిత

సుమేధ హైస్కూల్లో వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్జీవో కాలనీలోని సుమేధ హైస్కూల్లో సోమవారం రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాలలోని విద్యార్థినులు తమ తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. పాఠశాల డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి రక్షాబంధన్ విశిష్టతను వివరించారు.

వైభవంగా విఖనస మహర్షి జయంతి

ఫిరంగిపురం: మండల కేంద్రంలో విఖనస మహర్షి జయంతిని సోమవారం వైభవంగా నిర్వహించారు. విఖనస మహాముని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వేద పండితులు నారాయణం ప్రసాదాచార్యులు విఖనస మహర్షి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్.వంశీకృష్ణ, డి.ప్రసన్నమూర్తి, నరసింహమూర్తి, అజయ్‌కుమార్, డి.కృష్ణమూర్తి, డి.యామిని సాయి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడికొండ: ఫిట్స్‌తో స్పృహతప్పి పడిపోయిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన తాడికొండలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తన్నీరు శంకరరావు సోమవారం ఉదయం బయటకు వెళుతుండగా చింతచెట్టు సెంటర్ వద్దకు రాగానే ఫిట్స్ రావడంతో వెనక్కి పడగా తలకు బలమైన గాయమైంది. జీజీహెచ్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బాధితుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వాసు చెప్పారు.

గోడ కూలి వ్యక్తి మృతి

ముక్కామల(తాడికొండ): ప్రమాదవశాత్తు గోడకూలి వ్యక్తి మృతి చెందిన ఘటన తాడికొండ మండలం ముక్కామల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... కృష్ణా జిల్లా కోడూరు మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన ఆదిపూడి సంజీవరావు(40) మరి కొంత మంది వ్యవసాయ పనుల కోసం ముక్కామల గ్రామంలో ఉంటున్నారు. వినాయకచవితి పందిర్లు వేసేందుకు ఖాళీ స్థలంలో చెట్లు పీకుతూ గోడపైకి ఎక్కగా అది కూలడంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన జీజీహెచ్‌కు తరలించగా ఈ ఘటనలో సంజీవరావు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ద్విచక్ర వాహనం దహనం

తాడికొండ: గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి ద్విచక్ర వాహనానికి నిప్పంటించి పారిపోయిన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సీఐ వాసు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండ గ్రామానికి చెందిన అచ్యుతరావు ఎప్పటిలానే తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి బయట పార్కింగ్ చేసి నిద్రపోయాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించి పారిపోయారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనధికార కట్టడాలపై దృష్టి సారించండి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

తెనాలిఅర్బన్ : పట్టణంలో అనధికార కట్టడాలపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించడంతో పాటు వాటిని అడ్డుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సిబ్బందితో మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు వార్డుల్లో పర్యటిస్తూ ఉండాలని సూచించారు. అలాగే ప్రభుత్వ నిబంధనల ప్రకారం భవన నిర్మాణాలు జరుపుకునే వారికి ప్లాన్‌లు అందజేయాలన్నారు. ఏసీపీ సుబ్బా రావు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

అన్నసోదరి అనుబంధం ఎంతో గొప్పది



ఫిరంగిపురం: అన్న చెల్లి అనుబంధం ఎంతో గొప్పదని సిస్టర్ కె.నిర్మలామేరి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం రక్షాబంధన్ వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు రక్షాబంధనాలు కట్టుకొని స్వీట్లు తినిపించుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ నిర్మలమేరి మాట్లాడుతూ రక్షాబంధనం ఎంతో విశిష్టమైనదన్నారు. అనంతరం విద్యార్థులకు ఆశీస్సులు అందజేశారు.

త్రిపుల్ ఐటీ విద్యార్థికి అభినందన

చేబ్రోలు: మండలంలోని నారా కోడూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.చిత్రలేఖ పదో తరగతిలో 578 మార్కులతో మొదటి స్థానంలో నిలిచి, నూజివీడు ట్రిబుల్ ఐటీలో ప్రవేశం పొందింది. సోమవారం విద్యార్థిని అభినందన కార్యక్రమం జరిగింది. సమావేశానికి హెచ్ఎం ఎం.ఏడుకొండలు అధ్యక్షత వహించారు. ఎంఈవో ఏహెచ్‌వో ప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల నుంచి ఏటా ట్రిబుల్ ఐటీలో విద్యార్థులు ప్రవేశం పొందడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయుల సమష్టి కృషి వల్ల ప్రతిభ గల విద్యార్థులకు మేలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని బి. చిత్రలేఖను శాలువా, మెమెంటోతో సత్కరించారు. నగదు బహుమతి అందజేశారు. 500 పైగా మార్కులు సాధించిన 11 మంది విద్యార్థులకు మెడల్స్, మెమెంటోలను గణిత ఉపాధ్యాయుడు ఎ.శ్రీనివాసరావు బహూకరించారు. అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు ఎం. ఏడుకొండలు మెరిట్ విద్యార్థుల కోసం రూ. 25 వేలు డిపాజిట్ చేశారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు కలిసి సుమారు రూ. 20వేలు నగదును సబ్జెక్ట్ వారీగా ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వి.నాగమల్లేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, గౌరీ పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో ఏహెచ్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు

జీజీహెచ్‌లో మందుబాబులకు నో ఎంట్రీ

- అర్ధరాత్రి ఆస్పత్రుల్లో తిరగొద్దు..
- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్
- జీజీహెచ్‌లో అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీ
- సెక్యూరిటీ ఏజెన్సీ, పార్కింగ్ గుత్తేదారులకు నోటీసులు



భద్రతపై ఆరా తీస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో మందుబాబులు, బిచ్చగాళ్లకు ఎలాంటి ప్రవేశాలు కల్పించవద్దని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. కోల్‌కతాలో వైద్యురాలిపై లైంగిక దాడి ఘటన నేపథ్యంలో ఆదివారం రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 2 గంటల వరకు జీజీహెచ్‌లో ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆస్పత్రిలో మద్యం తాగిన వాళ్లు, బిచ్చగాళ్లు ఆస్పత్రిలో తిష్ట వేసి ఉండటాన్ని గమనించి వారికి క్లాసు పీకారు.

రక్షణ సిబ్బంది కీలకం..

ఆస్పత్రిలో ఎవరెవరు వస్తున్నారో.. బయటకు వెళుతున్నారో రక్షణ సిబ్బంది గమనించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో కొంత మంది అర్ధరాత్రి తిరుగుతుండటాన్ని ఆక్షేపించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాత్రి 10 గంటల తరువాత రోగులతో పాటు వారి సహాయకులు అధిక సంఖ్యలో ఆస్పత్రికి వస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పోలీసులు పెట్రోలింగ్ అవసరమన్నారు. పెద్ద సంఖ్యలో వస్తున్నా రోగుల సహాయకులను కట్టడి చేయడంలో విఫలమైన గుత్తేదారుకు నోటీసు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. వైద్యం కోసం వచ్చే రోగితో పాటు ఒకరిద్దరు మాత్రమే రావాలని ఎక్కువసంఖ్యలో రావడం వలన ఇబ్బందిగా ఉంటుందని వెల్లడించారు.

లోపాలు లేకుండా భద్రత..

ఆస్పత్రిలో రక్షణ వ్యవస్థలో లోపాలు కనిపిస్తున్నాయని డాక్టర్ కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. కొంతమంది వైద్యులు బయట నుంచి వస్తున్నారని అదే విధంగా ఆస్పత్రిలో ఉన్న కొంతమంది వైద్యులు బయట తిరగుతున్నారని, ఇది వైద్యులకు అంత శ్రేయస్కారం కాదన్నారు. ఆస్పత్రికి సంబంధం లేనివారు.. రోగులతో సంబంధం లేని వారు అనేకమంది మద్యం తాగి వస్తున్నారని చెప్పారు. అంబులెన్స్ వాహనాలు కూడా గంటల తరబడి ఉండటం వలన పార్కింగ్ సమస్య ఎక్కువతున్నట్లు వెల్లడించారు. తనిఖీల్లో సూపరింటెండెంట్ వెంట డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, ఏఆర్ఎంఓ డాక్టర్ సునీత ఉన్నారు.

విభిన్న ప్రతిభావంతుల్లో నైపుణ్యాలను వెలికితీయాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

గుంటూరు ఎడ్యుకేషన్: విభిన్న ప్రతిభావంతుల్లో దాగిన నైపుణ్యాలను వెలికితీయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి అన్నారు. సోమవారం రాజాగారితోటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ఉన్న విభిన్న ప్రతిభావంతుల కేంద్రాన్ని సందర్శించారు. ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపుతున్నారని అన్నారు. చిన్నతనంలోనే గుర్తించడం ద్వారా అంగవైకల్యం రాకుండా తగు చర్యలు తీసుకోవచ్చునని పేర్కొన్నారు. విద్య, వృత్తిపరమైన శిక్షణ, పునరావాసం, సామాజికంగా కలసి పోయే విధంగా చేయాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గురుబ్రహ్మం, ఉపాధ్యాయులు శ్రీధర్, భారతి పాల్గొన్నారు.



ఫిజియోథెరపి సేవలను పరిశీలిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

మహిళలకు రక్షణ కల్పించాలి

నెహ్రూ నగర్: దేశంలో మహిళలకు రక్షణ చట్టాలు కల్పించడంతో పాటు మహిళలపై దాడులు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ వార్డు సచివాలయం, ఎన్విరాన్మెంట్ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జాహ్నవి విజ్ఞప్తి చేశారు. కోల్‌కతాలో లైంగిక దాడికి గురైన మెడికల్ విద్యార్థినికి న్యాయం చేయాలని కోరుతూ లాడ్జి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ దేశంలో కులమతాలకు అతీతంగా కుటుంబంలోని మగ బిడ్డలకు విలువలు నేర్పే దిశగా ముందుకు రావాలని ఆకాంక్షించారు. పాఠ్యపుస్తకాలు స్థాయిలోనే ఆడపిల్లలకు గౌరవం కల్పించే అంశాలపై ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాజ్ కుమార్, రాజ కుమారి, అహర్ని, కవిత పాల్గొన్నారు.



లాడ్జి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామ సచివాలయ సెక్రటరీలు

బొప్పాయి రైతులను ఆదుకోవాలి

ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు వినతి

లక్ష్మీపురం:అన్నమయ్య జిల్లాలో నర్సరీల వారు నాణ్యతలేని బొప్పాయి విత్తనాలు తెచ్చి నాసిరకం నారును పెంచి రైతాంగాన్నికి అంటగట్టి మోసం చేసిన యాజమాన్యాల నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని, నర్సరీ యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసరావును కౌలు రైతు సంఘ నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన బొప్పాయి రైతులకు నాసిరకం నారు అమ్మిన నర్సరీ యాజమాన్యాలపై '2010 నర్సరీ చట్టం' ప్రకారం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఎకరానికి రెండు లక్షల రూపాయల నష్టపరిహారం నర్సరీ యాజమాన్యాల నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు. స్పందించిన ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు రైతులను మోసగించిన నర్సరీ యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



ఉద్యానశాఖ డైరెక్టర్‌కు అందించిన వినతి పత్రం చూపుతున్న రైతు సంఘ నాయకులు